# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



PM ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు
99086 89674 లో
సంప్రదించగలరు



హైదరాబాద్ | బుధవారం,మే7,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1




## రష్యా రాజధానిపై 100 డ్రోన్లతో
# విరుచుకుపడిన ఉక్రెయిన్

- ఉక్రెయిన్, రష్యా మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు
- మాస్కో సమీపంలో నాలుగు, ఇతర ప్రాంతాల్లో 9 విమానాశ్రయాలు మూసివేత
- ఖార్కివ్‌పై రష్యా డ్రోన్ల దాడి... పౌరులకు గాయాలు, ఆస్తి నష్టం.

మే6,( రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపు దిశగా అమెరికా వంటి దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు ఆగడం లేదు. తాజాగా ఉక్రెయిన్ దళాలు రష్యా భూభాగంపై భారీ స్థాయిలో డ్రోన్లతో విరుచుకుపడగా, రష్యా కూడా తీవ్రంగా ప్రతిస్పందించింది. ఈ దాడుల నేపథ్యంలో మాస్కో సహా పలు ప్రాంతాల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఉక్రెయిన్ నేడు రష్యాలోని డజనుకు పైగా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వందకు పైగా డ్రోన్లతో దాడులు చేపట్టింది. ఈ దాడుల ధాటికి మాస్కో సమీపంలోని నాలుగు ప్రధాన విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## పూర్తి సహకారం
# అందిస్తాం..



- పహల్గామ్‌లో ఉగ్రదాడి... ఖతార్ అమీర్ షేక్ తమీమ్ నుంచి ప్రధాని మోదీకి ఫోన్
- బాధిత కుటుంబాలకు ఖతార్ అమీర్ ప్రగాఢ సంతాపం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ
- దాడి సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టడంలో పూర్తి సహాయం

మే6,) జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటనపై ఖతార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో భారత ప్రజలకు తమ పూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–థానీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఫోన్ ద్వారా సంభాషించి, ఈ మేరకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–థానీ మధ్య జరిగిన సంభాషణలో పహల్గామ్ ఉగ్రదాడి ప్రధానంగా చర్చకు వచ్చింది. ఈ దాడిని ఖండించిన అమీర్, ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి తమ దేశం సంపూర్ణ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి, వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు భారత్ చేసే అన్ని ప్రయత్నాలకు పూర్తి సహకారం ఉంటుందని ఆయన ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు. ఈ కష్టకాలంలో ఖతార్ అమీర్ చూపిన సంఘీభావానికి, అందించిన మద్దతుకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరు దేశాల నేతలు తమ సంభాషణ సందర్భంగా భారత్–ఖతార్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్న తమ నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఖతార్ అమీర్ భారత పర్యటన సందర్భంగా తీసుకున్న కీలక నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలనే సంకల్పాన్ని కూడా వారు పునరుద్ఘాటించారు.



# కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

- కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అనుమతి
- క్యూఆర్ కోడ్, ప్రభుత్వ చిహ్నంతో స్మార్ట్ కార్డుల జారీ
- నెల రోజుల పాటు దరఖాస్తు ప్రక్రియ... గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు
- ఈ నెల 12 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా దరఖాస్తుల స్వీకరణ

అమరావతి,మే6 ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డులు లేని వారికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రేపటి (మే 7) నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. దీంతో పాటు, ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునేందుకు కూడా వీలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

## భద్రతపై ప్రధాని మోదీ
# ఉన్నతస్థాయి సమీక్ష..

- పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చ
- మే 7న దేశవ్యాప్తంగా 259 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహణకు కేంద్ర హోంశాఖ ఆదేశం
- దేశ భద్రతాంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి



ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మధ్య 48 గంటల్లో రెండుసార్లు భేటీ

న్యూఢిల్లీ,మే6,() పహల్గామ్ ఉగ్రవాద దాడి అనంతరం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, దేశ భద్రతాంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్‌తో నేడు సమావేశమై తాజా పరిణామాలపై చర్చించారు. కేవలం 48 గంటల వ్యవధిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ చర్చలు దేశ భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత్ కఠిన చర్యలు తీసుకుంటుందన్న సంకేతాల మధ్య ఈ సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మరోవైపు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కేంద్ర హోంశాఖ కూడా చురుగ్గా వ్యవహరిస్తోంది.

## రేవంత్ రెడ్డి వల్ల తెలంగాణ
# ప్రతిష్ట దెబ్బతింటోంది

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణకు శాపమన్న కేటీఆర్
- అత్యంత అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శ
- రేవంత్ రెడ్డి గారూ, దొంగను దొంగలాగే చూస్తారు: కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,మే6, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. "ఎక్కడకి వెళ్లినా దొంగలా చూస్తున్నారని ముఖ్యమంత్రి అంటున్నారు. మరి దొంగను దొంగలా కాకుండా ఎలా చూస్తారు? నోట్ల కట్టలతో దొరికిన దొంగను కచ్చితంగా దొంగ అనే అంటారు, దొంగలాగే చూస్తారు. ఒక విశ్వసనీయత లేని ఓటుకు నోటు దొంగను కాంగ్రెస్ అనే ఒక వెర్రి పార్టీ గుడ్డిగా నమ్మి ముఖ్యమంత్రిని చేసింది. కానీ దేశంలో మిగతా ఎవరూ నమ్మడం లేదు. మోసగాళ్లను, దొంగలను దొంగే అంటారు. చివరి రోజు వరకు నిన్ను అలాగే అంటారు. కాంగ్రెస్ పార్టీ దొంగ చేతికి తాళాలు ఇచ్చింది" అని తీవ్రంగా మండిపడ్డారు.

### ముఖ్యమంత్రి మాటలు శాపంగా మారాయి....

ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్తుకు శాపంగా పరిణమించాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేటీఆర్ నేడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు పీఆర్సీ, డీఏలు చెల్లించాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ప్రజల ముందు ప్రతినాయకులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తారా అంటూ రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అడిగిన ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి అనుచితంగా మాట్లాడారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు.

# హైదరాబాద్‌లో 'మిస్ వరల్డ్' సందడి..

- మే 31 వరకు చౌమొహల్లా ప్యాలెస్‌లో మిస్ వరల్డ్-2025 పోటీలు
- భద్రతా కారణాలతో చార్మినార్, పరిసర ప్రాంతాల్లో దుకాణాలు, వ్యాపారాల మూసివేత



హైదరాబాద్,మే6,( హైదరాబాద్ నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమానికి వేదిక కానుంది. మే 10వ తేదీ నుంచి 31 వరకు చారిత్రక చౌమొహల్లా ప్యాలెస్ (ఖిల్వత్ ప్యాలెస్)లో 'మిస్ వరల్డ్–2025' పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో, పోలీసులు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా చార్మినార్‌తో పాటు పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు, వ్యాపార సముదాయాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## స్మితా సబర్వాల్‌పై
# ప్రభుత్వానికి కక్ష లేదు..



హైదరాబాద్,మే6 ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్న ఆరోపణలను మంత్రి శ్రీధర్ బాబు ఖండించారు. "అధికారులు ఎవరైనా కొన్ని నియమ నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. స్మితా సబర్వాల్‌పై మాకు ఎలాంటి కక్ష లేదు" అని ఆయన స్పష్టం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్మితా సబర్వాల్ వ్యాఖ్యల విషయం తెలిసిందే.

# పాకిస్థాన్ సరిహద్దుల్లో నేడు భారత వాయుసేన 'వార్ గేమ్స్'

- రాజస్థాన్ భూభాగంలో భారీస్థాయి యుద్ధ విన్యాసాలకు సర్వం సిద్ధం
- రఫేల్, సుఖోయ్-30, మిరాజ్ 2000 యుద్ధ విమానాలతో కసరత్తు
- విన్యాసాల వేళ సరిహద్దు విమానాశ్రయాల నుంచి రాకపోకలు బంద్
- దేశవ్యాప్తంగా 300 ప్రాంతాల్లో పౌర రక్షణ మాక్ డ్రిల్స్



మే6,భారత వాయుసేన వార్ గేమ్స్ చేపడుతోంది. పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రాజస్థాన్ భూభాగంలో భారీస్థాయి యుద్ధ విన్యాసాలు నిర్వహించడానికి సిద్ధమైంది. అదే సమయంలో దేశవ్యాప్తంగా పౌరుల భద్రత, సంక్షోభ సమయాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్స్ కూడా జరుగుతున్నాయి. వాయుసేన వర్గాల సమాచారం ప్రకారం ఈ విన్యాసాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

# హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ**



పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట,మే 06: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలోని డిజి నగర్ లో నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు... ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజేపీ కేంద్రంలో అధికారం లోకి వచ్చిన 13 నెలల కాలం లో కార్మికులకు, కర్షకులకు ఉపయోగ పడే చట్టాలు తేకపోగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పార్లమెంటు సాక్షిగా మెజార్టీ బలంతో రద్దు చేసి కార్పోరేట్ కంపెనీలకు ఉపయోగ పడే లేబర్ కోడులను తేవడం చూస్తే మోదీ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నరో అర్థమవుతుందని అన్నారు. కావున మే 20న జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా కలిసి చేస్తున్న సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్ర కమిటీతో అన్నీ రంగాల కార్మికులు కలిసి సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం ముఠామేస్త్రి పటేల్ బిక్షం, లక్క పాక దేవయ్య, మీసాల ఆనంద్, రామలచ్చు, కోల సైదులు, నకరికంటి గురవయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు...

# వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి:ఎంఈఓ నకిరేకంటి రవి

పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, మే 06: యంగ్ఇండియా వేసవి శిక్షణ శిబిరంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలు వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుండి పదో తరగతి చదివే విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు నేటి నుండి 23వ తేదీ వరకు 15 రోజుల పాటు వివిధ అంశాలపై నిష్ణాతులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వబడుతుందని సమీప ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆసక్తి కలిగిన విద్యార్థుల పేర్లను నేటి సాయంత్రం లోగా అధిక సంఖ్యలో నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ వేసవి ఉచిత శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులు విద్య నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని వారు కోరారు.



**శిక్షణ అంశాలు**

**కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, క్యారమ్స్, టైలరింగ్, కోలాటం.**

**విద్యార్థులు తమ పేర్ల నమోదుకు కు కే.రవికుమార్ పి డి, సెల్: 94920 92702 పి. సుదర్శన్ పిటిఐ సెల్: 95055 5 0275 నెంబర్లలో సంప్రదించగలరని తెలిపారు.**


# రైతులు గుర్తింపుసంఖ్యకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**- ఏ ఓ కళ్యాణ్ చక్రవర్తి**



పాలకవీడు(ప్రజాముచ్చట:కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరములతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని పాలకవీడు మండల వ్యవసాయశాఖాదికారి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడి) పొందుటకు ఆధార్ కార్డు,భూ యాజమాన్య పాస్ పుస్తకము ఆధార్ కు లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని,పిఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని కావున రైతులందరూ రిజిస్ట్రీ చేసుకోవాలని కోరారు.

# రజక సంక్షేమ సంఘం స్టేట్ పోలిట్ బ్యూరోసభ్యుడిగా చిలక రాజు శ్రీను నియామకం...



నేరేడుచర్ల ప్రజాముచ్చట:రజక సంక్షేమ సంఘం స్టేట్ పోలిట్ బ్యూరో సభ్యుడిగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన చిలక రాజు శ్రీనును నియమిస్తున్నట్లు రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు బిక్షపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాష్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవ్యక్తిగత ప్రయోజనాల కన్నా సంఘ ప్రయోజనాలే మిన్నగా భావించి పనిచేయాలని రజక జాతి జనం కొరకు త్యాగనిరతి తో ముందుకు సాగాలని ఆయన కోరారు.నూతనంగా రాష్ట్ర రజక సంఘం పోలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికైన చిలక రాజు శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు బిక్షపతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాష్ లకు రాష్ట్ర జిల్లా నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దల తరబడి రజకులు అనేక అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా సాంఘికంగా రజకులుముందడుగు వేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

# కాంగ్రెస్ లో టీఆర్ఎస్ నేతల చేరిక



మే 6:తిమ్మాపూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో చైర్మన్ తోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో నుస్తులాపూర్ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, రామకృష్ణ కాలనీ తాజా మాజీ సర్పంచ్ మీసాల అంజయ్య, గొల్లపల్లి మాజీ సర్పంచ్ మల్లెత్తుల అంజయ్య యాదవ్, రామకృష్ణ కాలనీ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డితోపాటు వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్,పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, గోగూరి నర్సింహారెడ్డి, మామిడి అనిల్, మాచర్ల అంజయ్య, పోలు రాము, రమేశ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం స్థాయిని దిగజార్చుతున్న రేవంత్



పాలకవీడుప్రజాముచ్చట: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ ఒక సభలో మాట్లాడుతూ ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధులకు అప్పాయింట్మెంట్ ఇవ్వడం లేదని చెప్పులు ఎత్తుకుపోయేవారిగా చూస్తున్నారని అప్పు పుట్టడం లేదని నన్ను కోసుకు తింటారా అంటూ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడటం చాలా అభ్యంతరకరమని, తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఇప్పుడు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు అధికారంలోకి రావాలని ఏకైక లక్ష్యంతో ఆరు గ్యారెంటీలు వందల హామీలు ఉద్యోగులకు రైతులకు విద్యార్థులకు వ్యవసాయ కూలీలకు నిరుద్యోగులకు మహిళలకు హామీలు ఇచ్చి ఇప్పుడు హామీలను అమలు చేయకపోగా కుంటి సాకులు చెబుతున్నారని ఆయన విమర్శించారు.ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని వారికి రావాల్సిన వారి డబ్బులు ఇవ్వమని అడుగుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ ఉద్యోగులకు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే గత ప్రభుత్వానికి పట్టినగతి రేవంత్ ప్రభుత్వానికి పడుతుందని ఆయన హెచ్చరించారు.

# మెదక్ నుంచి రఘునందన్ రావు అందువల్లే గెలిచారు: జగ్గారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇరువురు నేతలపైనా ఘాటు విమర్శలు చేశారు.బీజేపీ ఎంపీ రఘునందన్ రావు రాజకీయంగా చాలా చిన్న వ్యక్తి అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్, హరీశ్ రావు మౌనంగా ఉండటం వల్లే, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలవకూడదనే వారి వ్యూహం కారణంగానే రఘునందన్ రావు మెదక్‌లో ఎంపీగా గెలిచారని అన్నారు. "మీరు మా ముఖ్యమంత్రిని విమర్శించకుంటే, నేను మీ ప్రధానమంత్రిని ఏమీ అనను" అంటూ రఘునందన్ రావుకు ఆయన అల్టిమేటం జారీ చేశారు.నల్లధనాన్ని ప్రజలకు పంచుతానన్న ప్రధాని మోదీ హామీ ఏమైందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతేమిటని రఘునందన్‌ను ప్రశ్నించారు. ప్రధాని మోదీని 'మోసగాళ్లకు మోసగాడు' అంటే బీజేపీ నేతలు బాధపడరా అని ప్రశ్నించారు. కాబట్టి రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడవద్దని అన్నారు. తాము ప్రధానిని గౌరవిస్తామని, కానీ రఘునందన్ రావు వంటి వారి విమర్శల వల్లే తాము కూడా ప్రతివిమర్శలు చేయాల్సి వస్తోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు."కాంగ్రెస్ వాళ్ల నాలుకలు చీరడం సాధ్యమా? కేటీఆర్ నాలుక కోస్తే ఏమొస్తుంది?" అంటూ జగ్గారెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్ సినిమా స్క్రిప్టులు చదివి డైలాగులు చెబుతారని ఆయన ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వానికి సత్తా లేకుండానే సంవత్సర కాలంలోనే రైతులకు రుణమాఫీ చేసిందా? అని అన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తుచేశారు. తాము పబ్లిసిటీ చేసుకోవడం లేదని, కానీ ఏడాదిలోనే వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని జగ్గారెడ్డి వివరించారు.

# నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన (14) మంది సభ్యులు జిల్లా ఎస్పీ ఎదుట లొంగుబాటు.





కొత్తగూడెం టౌన్ మే 6 06-05-2025 తేదీన నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన (14) మంది సభ్యులు జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోవడం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు మరియు 81 బిఎన్ %డ% 141 బిఎన్ సిఆర్పిఎఫ్ అధికారులు ఆదివాసీ ప్రజల అబివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు మరియు "ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకుని, నక్సలిజాన్ని విడిచిపెట్టి ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న (14) మంది మావోయిస్టు సభ్యులు (ముగ్గురు మహిళా సభ్యులు) ఏసిఎం-02, పార్టీ మెంబర్స్ -04, మిలిషియా మెంబర్స్ -03, కేఏఎంఎస్ మెంబర్స్ -01, విసిఎం -04 ఎస్పీ ముందు లొంగి పోవడం జరిగింది తెలుగాణ ప్రభుత్వం మరియు తెలంగాణ పోలీసు లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు అందిస్తున్న పునరావాసా సౌకర్యాలకు ఆకర్షితులై వివిద క్యాడర్లలో ఉన్నవారు తమ ఆయుధాలను విడిచిపెట్టి పోలీసుల ఎదుట లొంగిపోవడం జరుగుతుంది. లొంగిపోయిన అనంతరం వారికి చెందాల్సిన ప్రతిఫలాలను కూడా తక్షణమే అందేలా తెలంగాణ ప్రభుత్వం తరపున పోలీస్ కృషి చేస్తున్న విషయాన్ని గ్రహించి ఇక్కడ లొంగిపోవడం జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం అందించే సౌకర్యాలను పొందుతూ తమ కుటుంబ సభ్యులతో కలిసి లొంగిపోయిన వారు ప్రశాంత జీవనాన్ని గడుపుతున్నారు. ఈ సంవత్సరం జనవరి-2025 నుండి ఇప్పటివరకు నిషేదిత మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్లలో పనిచేసి 227 మంది మావోయిస్టు సభ్యులు వివిధ హొదాలలో కొత్తగూడెం పోలీసుల ఎదుట లొంగిపోవడం జరిగింది, అనగా డివి సీఎం -01, ఏసీఎం -11, పీఎం -27, మిస్ మెంబర్స్ -76, ఆర్పిసి కమిటస్ మెంబెర్స్ 26, డిఏకేయం / కెఎంఎస్ -41, సి ఎన్ ఎమ్ మెంబర్స్ -27. జి ఆర్ డి -18.గత కొంతకాలంగా నిషేదిత సిపిఐ మావోయిస్ట్ పార్టీ ఆదివాసి ప్రజలలో ఆదరణ, నమ్మకం కోల్పోయి కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటుగా, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ, ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి అమాయకపు ఆదివాసీ ప్రజలు జీవనం సాగించడానికి నిత్యం సంచరించే ప్రదేశాలలో మందుపాతరలను అమర్చుతూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మావోయిస్టు పార్టీ నాయకుల దుశ్చర్యాలతో ఆదివాసీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అమాయక ఆదివాసీలను పోలీసు ఇన్ఫార్మర్లు పేరుతో చంపడం మరియు హింసించడం జరుగుతున్నది.మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సభ్యులు స్వచ్చందంగా పోలీసుల ఎదుట లొంగిపోయి వారి కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడపాలని కొత్తగూడెం పోలీసు తరుపున విజ్ఞప్తి చేస్తున్నాం. లొంగిపోవాలనుకుని మావోయిస్ట్ సభ్యులు తమ దగ్గరలో గల పోలీస్ స్టేషన్లో లేదా జిల్లా ఉన్నతాధికారుల వద్ద గానీ సంప్రదించోచ్చని విజ్ఞప్తి చేస్తున్నాము. లొంగిపోయిన మావోయిస్ట్ సమ్యలకు పునరావాసం మరియు జీవనోపాధి కల్పించడం కోసం తెలంగాణ ప్రభుత్వం తరుపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ కృషి చేస్తుంది లొంగిపోయిన సభ్యుల వివరాలు 1)సోది బుద్ర 2)కలమా ఇడిమా3)పాదం నాందే4)మాధయ్ జోగా5)కుంజం కోన6)లేఖం సూక్తం7)పొడియం హిదామా8)మడివి మంగ9)కడితి నాందే10)కుర్సం సమ్మయ్య11)మడివి కామ12) నుపో లాకెమా 13)పొడియం జోగా14)మడివి సహదేవ్

# భూపతిపూర్ లో వడగాలి బీభత్సం..



రాయికల్ మే 6):రాయికల్ మండలంలో సోమవారం రాత్రి భారీ గాలులతో కూడిన వర్షం పడింది. దానివల్ల మామిడి,వరి రైతులకు తీవ్ర పంట నష్టం జరిగిందని, రైతులు కన్నీరు మున్నీరు అయ్యారు. భూపతిపూర్ గ్రామానికి చెందిన యువ రైతు జక్కుల పృద్విరాజ్ మాట్లాడుతూ సోమవారం గాలివానకు చేతికి వచ్చిన మామిడి పంట నేల పాలు అయ్యిందని, అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# హిందువులారా కదలి రండి- గంట అశోక్

**-గంభీరావుపేటలో హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ**

గంభీరావుపేటమే 6రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గంట అశోక్ ఆధ్వర్యంలో హిందూ ఏక్త యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు అనంతరం భారతీయ జనతా పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో హిందూ ఐక్యత కోసం గత కొద్ది సంవత్సరాల నుండి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ఈ హిందూ ఏక్తా యాత్రను కార్యక్రమం ప్రారంభించారు ఈ కార్యక్రమం మే 22 హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ లో నిర్వహించబడుతుంది ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క హిందువు తరలివచ్చి హిందూ ఐక్యతను చాటి చెప్పి హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేసే విధంగా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గంట అశోక్ జిల్లా అధికార ప్రతినిధులు గడ్డమీది ప్రసాద్



రెడ్డి దేవసాని కృష్ణ నాయకులు పత్తి స్వామి లక్ష్మీపురం రాజు గౌడ్ కోడే రమేష్ కోటయ్య గారి రాజేందర్ రెడ్డి డాక్టర్ సత్యనారాయణ విజేందర్ రెడ్డి చేపూరి ప్రభాకర్ రాగిశెట్టి నారాయణ గుడికాడి మహేష్ అంబటి దేవరాజు బోయన్న గారి శ్రీనివాస్ ఎల్లారెడ్డి రాజారామ్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**- వృద్ధులకు జొన్న జావ పంపిణి**

పినపాక, మే 6పినపాక మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. మద్దెల రాంగోపాల్ (టీచర్) సహకారంతో మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ తోలం శ్రీనివాసరావు చేస్తున్న సహాయ కార్యక్రమాలను పలువురు అభినందించారు. వేసవికాలంలో వృద్ధులకు జొన్న జావ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అనూష ,కాయం శేఖర్, ప్రసాద్, ప్రముఖ రిపోర్టర్ సనప భరత్, ముఖేష్, కలువేటి పవన్ ,ఈసం



గోపయ్య. సపక మాణిక్యం, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా అవార్డు అందుకున్న ఎస్సై శ్రీకాంత్

నిర్మల్ జిల్లా :- ప్రతినిధిరంగాపూర్, మే 6, తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ 2025 జీ తెలుగు కార్యక్రమం లో భాగంగా సీఎం చేతుల మీదగా రాష్ట్ర స్థాయి ఉత్తమ పోలీస్ రియల్ హీరో అవార్డును సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ అందుకున్నాడు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షం కారణంగా సారంగాపూర్ మహబూబ్ ఘాట్ వద్ద అర్ధరాత్రి ఓ కారు అదుపు తప్పి లోయలో బోల్తా పడగ సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బంది తో కలిసి ప్రాణాలుకు లెక్కచేయకుండా వెంటనే అక్కడకు చేరుకొని క్షతగాత్రులను కాపాడి వారిని క్షేమంగా ఆసుపత్రి కి తరలించి ప్రాణాలు కాపాడారు. అవార్డు అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ కు మండల వాసులు అభినందనలు తెలిపారు.






# రూ.1కే యూనిట్ విద్యుత్ సరఫరా..

నూతన ఎలక్ట్రానిక్స్ విధానం విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ రంగం అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన ఎలక్ట్రానిక్ ఉత్పత్తి విధానానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ పాలసీ ద్వారా రూ.4.2 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను రాష్ట్రంలో తయారు చేయాలని, అలాగే 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.ఈ నూతన విధానం కింద, ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్లకు పెట్టుబడుల ఆధారంగా, కేటగిరీల వారీగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి యూనిట్లకు 100 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా, పరిశ్రమలో నియమితులయ్యే ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.4,000 నుంచి రూ.6,000 వరకు ఐదేళ్ల పాటు ప్రోత్సాహకంగా అందించనున్నారు. పారిశ్రామిక ప్రగతికి అత్యంత కీలకమైన విద్యుత్‌ను కూడా రాయితీపై అందించాలని నిర్ణయించారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఐదేళ్లపాటు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూపాయికే సరఫరా చేయాలని ప్రభుత్వం పేర్కొంది.రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనువైన వాతావరణం ఉందని ప్రభుత్వం వివరించింది. విశాఖపట్నం, తిరుపతి, శ్రీసిటీ, నెల్లూరు, కడప, అనంతపురం వంటి ప్రాంతాల్లో ఇప్పటికే ఎలక్ట్రానిక్ క్లస్టర్లు ఉన్నాయని గుర్తు చేసింది. నైపుణ్యం కలిగిన యువత, ప్రభుత్వ అనుకూల విధానాలు, మెరుగైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ వంటివి పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం తెలియజేసింది. ఈ సమగ్రమైన ప్రోత్సాహకాలతో కూడిన నూతన పాలసీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# చంచల్‌గూడ జైలుకు గాలి జనార్ధన్ రెడ్డి సహా దోషుల తరలింపు

ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో తీవ్ర సంచలనం సృష్టించిన అనంతపురం జిల్లా ఓబుళాపురం అక్రమ మైనింగ్ (ఓఎంసీ) కేసులో హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. సుమారు పదిహేనేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం, ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గాలి జనార్దన్ రెడ్డితో పాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ వారికి ఏడేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. దీంతో వారిని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు.ఓబుళాపురం మైనింగ్ కంపెనీ వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసు విచారణలో భాగంగా గాలి జనార్దన్ రెడ్డి, ఆయన బావమరిది బీవీ శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారి (అప్పటి గనుల శాఖ డైరెక్టర్) వీడీ రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లను కోర్టు దోషులుగా తేల్చింది. వీరందరికీ ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.10,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)కి కూడా న్యాయస్థానం రూ.2 లక్షల జరిమానా విధించింది. తీర్పు వెలువడిన అనంతరం దోషులుగా తేలిన నలుగురికి కోర్టు ప్రాంగణంలోనే వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని కట్టుదిట్టమైన భద్రత నడుమ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.

# పాకిస్థాన్ సరిహద్దుల్లో రేపు భారత వాయుసేన 'వార్ గేమ్స్'

భారత వాయుసేన వార్ గేమ్స్ చేపడుతోంది. పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రాజస్థాన్ భూభాగంలో భారీస్థాయి యుద్ధ విన్యాసాలు నిర్వహించడానికి సిద్ధమైంది. అదే సమయంలో దేశవ్యాప్తంగా పౌరుల భద్రత, సంక్షోభ సమయాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్స్ కూడా జరుగుతున్నాయి.వాయుసేన వర్గాల సమాచారం ప్రకారం ఈ విన్యాసాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు ఐదున్నర గంటల పాటు నిర్విరామంగా సాగే ఈ కసరత్తులో రఫేల్, సుఖోయ్-30, మిరాజ్ 2000 వంటి అత్యాధునిక, శక్తివంతమైన యుద్ధ విమానాలు పాల్గొననున్నాయి. ఈ విన్యాసాలకు సంబంధించి పైలట్లకు ముందస్తు సమాచారాన్ని (నోటీస్ టు ఎయిర్‌మెన్ - %చీూూవీ%) వాయుసేన ఇప్పటికే జారీ చేసింది. ఈ విన్యాసాల కారణంగా సరిహద్దు ప్రాంతాల్లోని విమానాశ్రయాల నుంచి విమానాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.మరోవైపు భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ప్రస్తుత తరుణంలో కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ సూచనల మేరకు దేశవ్యాప్తంగా పౌర రక్షణ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. వైమానిక దాడులు, బాంబు దాడులు వంటి అత్యవసర, సంక్షోభ పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఎలా స్పందించాలి, తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే దానిపై అవగాహన కల్పించడమే ఈ డ్రిల్స్ ప్రధాన లక్ష్యం. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ మాక్ డ్రిల్స్‌ను కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు.

# జర్మనీ నూతన ఛాన్సలర్‌గా ఫ్రెడ్రిక్ మెర్జ్

కన్జర్వేటివ్ పార్టీ నేత ఫ్రెడ్రిక్ మెర్జ్ జర్మనీ నూతన ఛాన్సలర్‌గా ఎన్నికయ్యారు. అయితే, ఈ ఎన్నిక ప్రక్రియ ఊహించినంత సజావుగా సాగలేదు. తొలి విడత ఓటింగ్‌లో ఆయన మెజారిటీని సాధించడంలో విఫలమయ్యారు. యుద్ధానంతర జర్మనీ చరిత్రలో ఒక ఛాన్సలర్ అభ్యర్థి మొదటి రౌండ్‌లోనే ఓటమి పాలుకావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపింది.అంతకుముందు, జర్మనీకి పదో ఛాన్సలర్‌గా మెర్జ్ సునాయాసంగా గెలుపొందుతారని అంతా భావించారు. కానీ, మొదటి రౌండ్ ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. ఈ చారిత్రక వైఫల్యం తర్వాత కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే నిర్వహించిన రెండో విడత ఓటింగ్‌లో ఫ్రెడ్రిక్ మెర్జ్ విజయం సాధించారు. మొత్తం 630 ఓట్లకు గాను, ఆయనకు అనుకూలంగా 325 ఓట్లు లభించాయి. దీంతో ఛాన్సలర్ పీఠాన్ని అధిరోహించడానికి అవసరమైన స్పష్టమైన మెజారిటీ ఆయనకు దక్కింది. మరోవైపు, 289 మంది సభ్యులు ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేశారు.ఫ్రెడ్రిక్ మెర్జ్ ఛాన్సలర్‌గా ఎన్నికవుతారని పలువురు రాజకీయ విశ్లేషకులు ముందుగానే అంచనా వేశారు. మెర్జ్ నాయకత్వంలో జర్మనీ భవిష్యత్తు ఎలా ఉంటుందో చూడాలని అంతర్జాతీయ సమాజం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# హైదరాబాద్‌లో 'మిస్ వరల్డ్' సందడి.. చార్మినార్ వద్ద వ్యాపారాలు బంద్!

హైదరాబాద్ నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమానికి వేదిక కానుంది. మే 10వ తేదీ నుంచి 31 వరకు చారిత్రక చౌమొహల్లా ప్యాలెస్ (ఖిల్వత్ ప్యాలెస్)లో 'మిస్ వరల్డ్-2025' పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో, పోలీసులు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా చార్మినార్‌తో పాటు పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు, వ్యాపార సముదాయాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.సౌత్ జోన్ పోలీసులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే విదేశీ ప్రతినిధులు, సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టారు. చార్మినార్ చుట్టుపక్కల ఉన్న అన్నిరకాల తోపుడుబండ్ల దుకాణాలను తొలగిస్తున్నారు. రెండు రోజుల క్రితం చిరు వ్యాపారులతో సమావేశమైన పోలీసు అధికారులు, పోటీలు ముగిసే వరకు దుకాణాలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో చార్మినార్ వద్ద వ్యాపారులు ఈ రోజు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. పాతబస్తీలోని ఇతర ప్రాంతాలలో కూడా పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.ఈ చర్యల వల్ల తమ వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుందని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా పోలీసుల ఆదేశాలను పాటించక తప్పడం లేదని వారు పేర్కొంటున్నారు.మరోవైపు, అతిథులు భాగ్యనగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. బీఎన్ఎస్ 2023లోని సెక్షన్ 163 ప్రకారం నగరంలోని పలు ప్రాంతాల్లో రిమోట్ కంట్రోల్ డ్రోన్లు లేదా పారా గ్లైడర్లు లేదా రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్ క్రాఫ్ట్‌లను ఎగురవేసేందుకు అనుమతి లేదని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి అందాల భామలు, మాజీ మిస్ వరల్డ్‌లు ఇప్పటికే హైదరాబాద్ నగరానికి చేరుకుంటున్నారు. విదేశీయుల భద్రత కోసం చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

# త్వరలో జగన్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: పట్టాభిరామ్

యాక్సెస్ రెన్యువబుల్ ఎనర్జీ ఒప్పందం విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వం కంటే తక్కువ ధరకే తాము ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్ర ఖజానాకు రూ.2,719 కోట్లు ఆదా చేశామని ఆయన స్పష్టం చేశారు. జగన్ రెడ్డి బుద్ధి ఎలాంటిదో ప్రజలు తెలుసుకోవాలి.. వాస్తవాలను గ్రహించాలని అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వం 2022 నవంబర్ 24న యాక్సెస్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థతో యూనిట్‌కు రూ.5.12 చొప్పున ఒప్పందం కుదుర్చుకుందని, తాము అధికారంలోకి వచ్చాక దానిని యూనిట్‌కు రూ.4.60కే సవరించి, తద్వారా రూ.2,719 కోట్లు ఆదా చేశామని పట్టాభిరామ్ వివరించారు. వైసీపీ నేతలు తమ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారంతా 'జైల్‌మేట్స్' అని, మళ్లీ అక్కడికే వెళతారని వ్యాఖ్యానించారు.యాక్సెస్ రెన్యువబుల్ ఎనర్జీ ఒప్పందాలపై జగన్ రెడ్డి పకోడి ఛానెల్, కరపత్రికలో విషం చిమ్ముతూ అబద్దాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా రూ. 2,719 కోట్లు తగ్గించడం జగన్ రెడ్డికి నేరమా? అని ప్రశ్నించారు. రకరకాల కుంభకోణాల్లో వైసీపీ నేతలు తిన్నదంతా బయటకు వస్తుందని.. జగన్ రెడ్డికి గతంలో ఆత్మగా వ్యవహరించిన వ్యక్తికి నేడు పట్టిన గతే జగన్ రెడ్డికి కూడా త్వరలో పడుతుంది.. వారందరూ త్వరలోనే జైల్లో సంతోషంగా కలుసుకొని కబుర్లు చెప్పుకోవచ్చని పట్టాభి ఎద్దేవా చేశారు.ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) ఆదేశాల మేరకే ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లపై నిర్ణయాలు తీసుకుంటోందని పట్టాభిరామ్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పాత విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) రద్దు చేస్తూ జీవో ఇచ్చి, కేంద్రం అక్షింతలు వేశాక, పలు కంపెనీలు కోర్టుకెళ్లాయని గుర్తుచేశారు. చివరికి, 2022 ఆగస్టులో పాత ఒప్పందాలను కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి, అదే ఏడాది నవంబర్‌లో యాక్సెస్ సంస్థతో ఏపీఈఆర్సీ నిర్ణయించిన రూ.5.12 ధరకే పీపీఏ కుదుర్చుకుందని ఆధారాలతో సహా వివరించారు. తాము యూనిట్ ధరను రూ.4.60కి తగ్గించి ఒప్పందం చేసుకుంటే వైసీపీ నేతలు ఎలా ప్రశ్నిస్తారని సవాల్ విసిరారు.ప్రస్తుత మార్కెట్ ధరల కంటే ఎక్కువ రేటుకు పీపీఏ చేసుకున్నామన్నది అవాస్తవమని, ఫర్మ్ అండ్ డిస్పాచబుల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల ధరల కంటే తాము చేసుకున్న పీపీఏ రేటు తక్కువేనని స్పష్టం చేశారు. బ్యాటరీ స్టోరేజ్ బాధ్యత, ఖర్చు డెవలపర్‌దేనని ఏపీఈఆర్సీ తీర్పులో స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం 2022-23లో సాయంత్రం పీక్ అవర్స్‌లో యూనిట్‌ను రూ.11.78 వరకు, సగటున రూ.9.30కు కొనుగోలు చేసిందని, అలాంటిది తాము రూ.4.60కే ఒప్పందం చేసుకోవడం తప్పా అని నిలదీశారు. చంద్రబాబు రాష్ట్ర హితం కోసమే ఆలోచిస్తారని, ప్రజలపై భారం మోపకుండా పాలన చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పట్టాభిరామ్ పేర్కొన్నారు.

# సింధూ జలాల్లో రక్తం పారుతుందన్న బిలావల్ భుట్టో నోట 'శాంతి' మాట

పహల్గామ్ ఉగ్రదాడి, అనంతరం సింధూ జలాల ఒప్పందంపై భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాల నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో శాంతి చర్చలకు తమ దేశం సిద్ధంగా ఉందని ప్రకటిస్తూనే, విధ్వంసం లేదా శాంతిలో ఏదో ఒకటి తేల్చుకోవాల్సిందిగా భారత్‌కు అల్టిమేటం జారీ చేశారు.పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీలో మాట్లాడుతూ, బిలావల్ భుట్టో భారత్‌తో చర్చల అంశాన్ని ప్రస్తావించారు. "భారత్ శాంతి మార్గాన్ని కోరుకుంటే, బిగించిన పిడికిలితో కాకుండా స్నేహ హస్తంతో ముందుకు రావాలి. కల్పితాలు కాకుండా వాస్తవాలతో చర్చలకు రావాలి. పొరుగు దేశంగా వారితో కూర్చుని వాస్తవాలు మాట్లాడుకుందాం" అని ఆయన అన్నారు. అయితే, ఇదే సమయంలో, "ఒకవేళ అలా కాదనుకుంటే, పాకిస్థాన్ ప్రజలను ఎవరూ మోకరిల్లేలా చేయలేరని గుర్తుంచుకోవాలి. పాక్ ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారు. ఇది యుద్ధంపై మక్కువతో కాదు. స్వేచ్ఛపై ప్రేమతో మాత్రమే" అంటూ హెచ్చరిక ధోరణిలో వ్యాఖ్యానించారు. ఇటీవల సింధూ నదీ జలాల విషయంలో "నీరు పారకపోతే రక్తం పారుతుంది" అంటూ బిలావల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. అయితే, అది ఒక 'ముగిసిన అధ్యాయం' అని, తమ చరిత్రలో అదొక 'దురదృష్టకరమైన భాగం' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉగ్రవాదం వల్ల పాకిస్థాన్ బాధితురాలిగా మారిందని, తాము ఉగ్రవాదాన్ని ఎన్నడూ ప్రోత్సహించలేదని ఆయన తెలిపారు.